క్లుప్తంగా

వాలంటీర్ల సమస్యపై చర్చించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వాలంటీర్ల సమస్యలపై కేబినెట్ సమావేశంలో చర్చించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుని వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.10వేల గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. తమకు అనుకూల ప్రకటన రాకుంటే చలో సీఎం క్యాంపు కార్యాలయం కార్యక్రమం చేపడతామన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో రాజీనామా చేసిన వారిని కొనసాగించాలని, 4 నెలల గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు స్పందించకపోతే నిరసన దీక్షలు చేపడతామన్నారు.

ఏఎన్ఎంలకు వెయిటేజీ మార్కులు కలపాలి

కడప రూరల్ : గ్రామ సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నవారికి వెయిటేజీ మార్కులు కలపాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంట్రాక్టు పారామెడికల్ సంఘం గౌరవాధ్యక్షులు వెంకటసుబ్బయ్య తెలిపారు. గ్రేడ్-3 ఏఎన్ఎంలకు 15 వెయిటేజీ మార్కులు కలపడం వలన గ్రేడ్-2 పదోన్నతులు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం వెయిటేజీ మార్కులు కలిపి సీనియార్టీ లిస్టులో అవకాశం కల్పించాలని పేర్కొన్నారు.

వాహనదారులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : వాహనదారులకు మెరుగైన సేవలు అందించాలని జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కృష్ణవేణి పేర్కొన్నారు. నగర శివారులోని ఊటుకూరు జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఎనిమిది జిల్లాల అధికారులతో జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకువచ్చిన ఈ చలానా యాప్ వినియోగించే విధంగా అధికారులు వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ పటిష్టంగా పనిచేయాలని, ఎంచుకున్న ఆదాయ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప డీటీసీ చంద్రశేఖరరెడ్డి, అన్నమయ్య, అనంతపురం, సత్యసాయి, కర్నూల్, నంద్యాల చిత్తూరు, తిరుపతి డీటీసీలు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

కమలాపురం : స్థానిక మత్కన్యకాపరమేశ్వరీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ అంబటి సురేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకట రమణయ్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.

ఊరెళ్తున్నారా.. ఇవి పాటించండి

- ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా చోరీలకు చెక్
- రోజుల తరబడిగా ఊర్లకు వెళ్లే వారికి 'రక్ష'

పిల్లలకు సెలవులు వచ్చాయంటే చాలు.. ఇంటిల్లిపాదీ తమ స్వగ్రామాలకు.. తీర్థయాత్రల పేరుతో పుణ్య క్షేత్రాలకు వెళ్లడం పరిపాటి. రోజుల తరబడి ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేవారు.. ఖచ్చితంగా తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వరు. దొంగతనం జరిగి నగలు, నగదు పోయిన తర్వాత బాధ పడుతుంటారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్.హెచ్.ఎం.ఎ స్)తో పోలీసులు ఈ సమస్యకు పరిష్కారం చూపుతు



కడప అర్బన్ : కడప నగరంలో లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్.హెచ్.ఎం.ఎస్)ను జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2017లో ప్రారంభించారు. ముందుగా నగర వాసులు ఎల్‌హెచ్‌ఎంఎస్ పోలీస్ యాప్ ద్వారా తమ ఇంటి అడ్రస్ నమోదు చేసుకుని రిజిష్టర్ చేసుకోవాలి. ఎప్పుడైనా ఊళ్లకు వెళ్లే సమయంలో యాప్ ద్వారా వెంటనే తమ దగ్గర పోలీస్ స్టేషన్ లేదా బ్లూ కోల్ట్స్ పోలీసుల ద్వారా ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరా తీసుకువచ్చి ఇళ్లలో ఏర్పాటుచేసుకోవాలి. దీంతో దొంగతనాలను, దోపిడీలకు పాల్పడేందుకు వచ్చిన వారి ఫొటోలు క్యాప్చర్ చేసి ఈ విధానం ద్వారా పోలీసులకు సమాచారం అందుతుంది. ఈ పరికరంతో తాళం వేసిన ఇళ్లపై పోలీసుల కంట్రోల్ రూం ద్వారా నిఘా ఉంటుంది.

ఇవి పాటిస్తే మేలు

- ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు, టూర్లకు వెళ్లే సమయంలో ఖచ్చితంగా తమ వెంటే విలువైన బంగారు ఆభరణాలు, డబ్బు తీసుకువెళ్తే మంచిది. బ్యాంకు లాకర్లలో దాచుకున్నా సురక్షితంగా ఉంటాయి.
- తమ చుట్టు ప్రక్కల వాళ్లు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిన సమయంలో ఎవరైనా అనుమానాస్పదంగా వుంటే వారి సమాచారాన్ని డయల్ 100కు, 112కు గానీ తెలియజేయాలి. చోరీలు జరగకుండా ఇళ్లల్లో వుండేవారు ఎప్పటికపుడు అప్రమత్తంగా వుండాలి.
- తాళాలు వేసిన తరువాత తమ ఇంటిలోని సభ్యులు వేరొకరు ఇంటికి రావాలంటే తాళాలు వారికి అందుబాటులో ఉండేలా తలుపులపై, ఇళ్ల ముందు వున్న పూలకుండీలలోగానీ పెట్టి వెళ్ల వద్దు. దొంగలు సులభంగా ఇళ్లలో మనుషుల మాదిరే వెళ్లి చోరీ చేస్తారు.

ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

దొంగతనాల బారిన పడకుండా ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుండాలి. పోలీసులు చేప్పే నియమాలు ఖచ్చితంగా పాటించాలి. చోరీలు జరగకుండా 'ఎల్‌హెచ్‌ఎంఎస్' విధానం సద్వినియోగం చేసుకోవాలి. విలువైన బంగారు ఆభరణాలు, డాక్యుమెంట్లను బ్యాంకు లాకర్లలో దాచుకుంటే మంచిది.

- ఎస్.రమాకాంత్, ఇన్‌ఛార్జి డీఎస్పీ, కడప



కడపకు కానుకగా 'కళాకృతి'

ఫ్యామిలీ కోర్టు జడ్జి ఇంతియాజ్ అహ్మద్



ఆర్ట్ గ్యాలరీని ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జడ్జి ఇంతియాజ్ అహ్మద్

కడప కల్చరల్ : కడప వాసులకు ఓ మంచి కానుకగా కళాకృతి ఆర్ట్ గ్యాలరీని ప్రముఖ వైద్యులు మాధవి అందజేయడం విశేషమని జిల్లా నాలుగవ అదనపు సెషన్స్ జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి షేక్ ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు. బుధవారం నగరంలోని ఎన్జీవో కాలనీ లో కళాకృతి ఆర్ట్ గ్యాలరీ, ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారూపాల్లో చిత్రలేఖనానికి ప్రత్యేకత ఉందని, మనసులోని భావాలకు రంగుల్లో రూపం ఇచ్చేందుకు చిత్రకారుడు ఎంతో శ్రమించాల్సి ఉందన్నారు. డాక్టర్ మాధవి స్వయంగా చిత్రకారులు గనుక తనతోపాటు ఇతర చిత్రకారులను ప్రోత్సహించేందుకు ప్రత్యేకంగా సొంతంగా ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ తనలాంటి చిత్రకారులను ప్రోత్సహించే విధంగా ఈ ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశామన్నారు. ఈ గ్యాలరీలో తంజావూరు పెయింటింగ్స్, కాన్వాస్ పెయింటింగ్స్, ఇత్తడి కళాకృతులు, హస్త కళారూపాలు అందుబాటులో ఉంచామన్నారు. సీనియర్ వైద్యులు ఎస్.సుబ్రమణ్యారావు మాట్లాడుతూ చిత్రకారులకు ప్రోత్సాహం అవసరమన్నారు. సీనియర్ చిత్రకారులు జి.భాస్కర్‌రెడ్డి, శేర్వాని (అతావుల్లాఖాన్), ఆనంద్ ప్రసాద్, వెంకటేష్, మృత్యుంజయరావు, గిరి, చరిత, శ్రీనులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రామముని రెడ్డి, న్యాయవాది డి.లక్ష్మీనారాయణ, ప్రముఖ వైద్యులు వైవీ సుబ్బారెడ్డి, సుబ్బారావు, పల్లా భాస్కర్, శ్రీదేవి, సామా సుధ, కళావతి, ప్రసాద్, సాయి కిషన్, సాయికిరణ్ పాల్గొన్నారు.

స్పేస్ వీక్ ఎగ్జిబిషన్‌తో పిల్లలలో సృజనాత్మకత

జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్



బహుమతులు సాధించిన విద్యార్థులతో కలెక్టర్, షార్, అధికారులు

కడప ఎడ్యుకేషన్ : స్పేస్ వీక్ ఎగ్జిబిషన్‌తో పిల్లలలో సృజనాత్మక ఆలోచనలు ఉద్భవించి, పరిశోధనల వైపు అడుగులు పడేందుకు అవకాశముంటుందని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. కడప నగర శివారులోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో కేఎస్ఆర్ఎం, ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన వరల్డ్ స్పేస్ వీక్-2024 కార్యక్రమం బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సరికొత్త ఆలోచనలు శాస్త్ర సాంకేతికత పురోభివద్ధి, పరిణామాలకు నాంది పలుకుతాయని అన్నారు. జిల్లాలోని ప్రైవేట్, గవర్నమెంట్ స్కూల్స్ నుంచి 9948 విద్యార్థులు స్పేస్ వీక్ ఎగ్జిబిషన్స్ వీక్షించారని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీఎస్ఎస్.మూర్తి తెలిపారు. అనంతరం స్పేస్ వెదర్ చేంజ్ థీమ్‌తో వర్క్‌షాప్, సైన్స్ ఎగ్జిబిషన్, వ్యాస రచన, వక్తృత్వ, షార్ట్‌ఫిల్మ్, సైన్సు నమూనాల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు కలెక్టర్ జ్ఞాపిక, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టీఎస్.ప్రసాద్, డాక్టర్ వీరశంకర్, సురేష్ బాబు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ టీచర్స్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలోని ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున పేర్కొన్నారు. బుధవారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తేదీ జరగబోయే మంత్రివర్గ సమావేశంలో దసరా కానుకగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రెండు డీఏలను మంజూరు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మేండ్రగుత్తి గంగరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శేషగిరి రావు, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌బాబు, కార్యదర్శులు గంగాధర్, జయరాం పాల్గొన్నారు.

కాశినాయన క్షేత్ర సమస్యలను పరిష్కరించాలి



కేంద్ర మంత్రిని కలిసిన రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని కాశినాయన జ్యోతి క్షేత్రంలో సమస్యలను పరిష్కరించాలని కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్రయాదవ్‌కు రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం విన్నవించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాశినాయనలో ఆలయ అభివృద్ధిని అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని కాశినాయన కమిటీ ప్రతినిధులు తమకు విన్నవించారన్నారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా 2014లో కేసు పెట్టారని తమ పార్టీ నేతలు వంగల శశిభూషణ్‌రెడ్డి, బొమ్మన సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, బద్వేల్ నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి రితీష్ రెడ్డి తనకు ఇటీవల తనకు విన్నవించారన్నారు. ఈ మేరకు సత్యకుమార్ యాదవ్ కేంద్ర మంత్రిని కలిసి ఆ సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

ఉక్కు పరిశ్రమతో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న పివి.సుందరరామరాజు

కడప ఎడ్యుకేషన్ : విభజన చట్ట ప్రకారం జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి కలుగుతుందని అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పివి.సుందరరామరాజు డిమాండ్ చేశారు. కడపలో జరిగిన రాయలసీమ జిల్లాల వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని హామీలివ్వడం.. అధికారంలోకి వచ్చాక నాయకులు విస్మరించడం తరచూ జరుగుతోందన్నారు. జిల్లాలోని మూడు ప్రాంతాల్లో ఇప్పటికే భూమి పూజ చేసి లక్షలాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని వృథా చేశారన్నారు. సాగునీటి ప్రాజెక్టులను చిత్తశుద్ధితో పూర్తి చేయాలని, కడప బెంగళూరు రైల్వే పనులు వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీరం సుభాష్ చంద్రరెడ్డి, జయవర్ధన్, సుబ్బమ్మ, ప్రదీప్‌రెడ్డి, పృథ్వి, పోతులయ్య, రాజేంద్ర, అజ్మతుల్లా, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

చేగవేరా స్ఫూర్తితో కడప ఉక్కుకై ఉద్యమిద్దాం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : చేగవేరా స్ఫూర్తితో యువకులు కడప ఉక్కు కోసం ఉద్యమించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. చేగవేరా వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో చేగవేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ యువకులు చేగవరా చిత్రం ముద్రించుకోవడం కాకుండా.. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. రాబోయే రోజుల్లో అఖిల పక్షాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉక్కు పరిశ్రమ సాధనకు పోరాటం చేస్తామన్నారు.

పెళ్లిసందడి



నూతన వధూవరులతో ఎంపీ, ఎమ్మెల్సీ

పోరుమామిళ్ల : రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి, ఓఎల్ఎఫ్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆరోగ్యరాణిల ఏకైక కుమారుడు గిరిప్రణీత్‌రెడ్డి-అమితల వివాహం పోరుమామిళ్లలో బుధవారం జరిగింది. వివాహానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, రాచమల్లు శివ ప్రసాదరెడ్డి, అంజద్‌బాష, కమలమ్మ, మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, స్టేట్ ఫుడ్‌కార్పొరేషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి, పీఆర్ ఆర్‌డీ రాష్ట్ర మాజీ సలహాదారు నాగార్జున రెడ్డి, పార్టీ నాయకులు, అధికారులు వధూవరులను ఆశీర్వదించారు.

విప్లవ కెరటం చెగవేరా



చేగవేరా చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

కడప ఎడ్యుకేషన్ : అసమానతలు, అన్యాయాలపై ఎక్కుపెట్టిన అస్త్రం చేగవేరా అని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసుయాదవ్ అన్నారు. కొనియాడారు. చేగవేరా వర్ధంతి సందర్భంగా కడప గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య కార్యాలయలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీకి గురవుతున్న ప్రజలను విప్లవం వైపు మళ్లించి విప్లవ గెరిల్లా దళానికి చేగవేరా నాయకుడయారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రెడ్డిసాయి, నాగమల్లయ్య, నరసింహ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



చేగవేరా చిత్రపటం వద్ద జోహార్లు అర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో కడప పీడీఎస్‌యూ కార్యాలయంలో బుధవారం చేగవేరా వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, శ్రీనాథ్‌యాదవ్, ముబారక్ బాషా, షమీముల్లా , తదితరులు పాల్గొన్నారు.


క్రైస్తవ హక్కుల పరిరక్షణకు కృషి

కడప కోటిరెడ్డి సర్కిల్: క్రైస్తవ సమాజాన్ని పరిరక్షించి, వారి హక్కుల సాధనకు తన వంతు కృషి చేస్తానని క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్ ప్రసాద్ పేర్కొన్నారు. కడప నగరంలోని రెడీమర్ చర్చిలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ దళం వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాల్ ప్రసాద్ మాట్లాడుతూ క్రైస్తవులపై జరిగే దాడులకు సమాధానం చెబుతూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. మదర్ థెరిస్సా చూపిన ప్రేమ, విలియం కేరీ సేవ, మార్టిన్ లూథర్ పోరాటం స్ఫూర్తిగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం దళం కార్యకలాపాల నిర్వహణకు జిల్లా అధ్యక్షుడిగా డీవీ.ప్రసాద్, ఏపీ స్టేట్ జాయింట్ సెక్రటరిగా శేషం ప్రసాద్, జిల్లా కార్యదర్శిగా జోసెఫ్, యువజన విభాగం అధ్యక్షుడిగా సురేష్‌ను నియమంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.



సరస్వతీ మాతగా నడివీధి గంగమ్మ



సరసర్వతీమాతగా కన్యకాపరమేశ్వరి



కాళీయ మర్దన అలంకారంలో విజయదుర్గమ్మ



సరస్వతీమాతగా కామకోటి కళాంబదేవి



శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సరస్వతీ మాతగా బాల పోలేరమ్మ



గరుడ వాహనంపై లక్ష్మీ వేంకటేశ్వరుడు



గాయత్రి దేవి అలంకారంలో పార్వతీ దేవి



సరస్వతి దేవి అలంకారంలో మహాలక్ష్మీదేవి



కాళేయ మర్దనగా లక్ష్మీసత్యనారాయణస్వామి

చదువుల తల్లీ...వందనం

కడప కల్చరల్ : 'అమ్మా! సరస్వతీమాత మా పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి..వారు చదువుల్లో మంచి ప్రతిభ చూపేలా మనసారా దీవించు తల్లీ' అంటూ భక్తులు చదువుల తల్లి సరస్వతీ మాతను ప్రార్థించారు. దసరా ఉత్సవాలలో భాగంగా కడప నగరంలోని దేవీ ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం ఆరు గంటల నుంచి భక్తులు ఆలయాల బాట పట్టారు. సరస్వతీమాతగా ఆలయాల్లో అమ్మవారిని అలంకరించడంతో తమ పిల్లలను గుడికి తీసుకెళ్లి తల్లిదండ్రులు ప్రత్యేక పూజలు చేయించారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కడప రాయుడు దేవుని కడప లక్ష్మీ వేంకటేశ్వర స్వామి గరుడ వాహనంలో భక్తులను కరుణించారు. దేవుని కడప మాడ వీధుల్లో ఊరేగింపుగా వచ్చిన స్వామి, అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పెద్దబెస్తవీధిలోని బాలపోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని సరస్వతీ మాతగా అలంకరించారు. గడ్డిబజారు సత్యనారాయణస్వామి ఆలయంలో కాళీ మర్దనగా అలంకరించారు. కామకోటి కళాంబదేవి, లలితా పంచాయతన, వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయాల్లో అమ్మవార్లను సరస్వతీ మాతగా కొలువుదీర్చారు. విజయదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని కాళరాత్రిగా అలంకరించి పూజలు జరిపారు.

చదువుల తల్లీ నమోస్తుతే..!

అమ్మవారికి అత్యంత ప్రియమైన రోజుగా భావించే ఆమె జన్మ తిథి మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక భక్తులు అమ్మవారికి కానుకగా వెండి వీణను సమర్పించుకున్నారు. స్థానిక చిన్న బెస్తవీధిలోని నడివీధి గంగమ్మ తల్లికి మొక్కు చెల్లింపులో భాగంగా స్థానిక భక్తుడు మాకం సురేష్‌కుమార్, రజని దంపతులు కుటుంబ సభ్యులైన సునీల్ కుమార్, దివ్యసాయి, రాగ దీక్షితలతో కలిసి 650 గ్రాముల వెండితో తయారు చేసిన వీణను అమ్మవారికి సమర్పించారు. ఆలయ నిర్వాహకులు గోపాల్ సింగ్ దంపతులు వారిచే అమ్మవారికి పూజలు నిర్వహింపజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక అలంకరణ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేవీ నవరాత్రుల్లో భాగంగా నగరంలోని 45వ డివిజన్ పరిధిలోని ఊటుకూరు గ్రామంలోని శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయంలో వివిధ రూపాల్లో అమ్మవార్లు దర్శమిచ్చారు. బుధవారం ఆలయంలోని పార్వతి దేవి గాయత్రి దేవి అలంకారంలో, మహాలక్ష్మీ దేవి సరస్వతి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

నగరంలో బిందె సేవ సందడి

కడప కల్చరల్ : కడప నగరంలో బుధవారం బిందె సేవ కార్యక్రమం సందడిగా సాగింది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సప్తమితో కూడిన మూల నక్షత్రం ఘడియలు రావడం పవిత్రంగా భావించి బిందె సేవను చేపట్టారు. ఉదయం ఆలయం వద్ద బిందె సేవకులను ఎంపిక చేసి ప్రధాన కలశాన్ని దక్కించుకున్న భక్తులు దాన్ని శిరస్సుపై ఉంచుకుని ఊరేగింపుగా బయలుదేరారు. దీక్షలో ఉన్న మరికొందరు బాలలు, యువకులు ఊరేగింపులో పాల్గొన్నారు. కేరళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్శణగా నిలువగా, అడుగడుగునా భక్తుల నీరాజనాలు అందుకుంటూ బిందె సేవ ఊరేగింపు సాగింది. ఊరేగింపులో ఒంటెలు, గుర్రాలు కూడా పాల్గొనడంతో నగర వాసులు వాటిని ఆసక్తిగా తిలకించారు. కొందరు పురాణ ప్రముఖులుగా, మరికొందరు రాజులుగా వేషాలు ధరించి సాగడం అందరినీ ఆకట్టుకుంది. కన్యకాంబ స్తుతిని గురించి రాసి ఉన్న ఎర్రని పతాకాలను చేతబూని భక్తులు జై వాసవాంబ అంటూ నినాదాలు చేస్తూ సాగారు.



బిందె సేవలో భక్తులు



ఊరేగింపులో ఆకర్షించిన ఒంటెలు, గుర్రాలు



ఊరేగింపులో కేరళ వాయిద్యాల సందడి